క్లుప్తంగా

బీపీ పరీక్షల నిర్వహణ

మానవపాడు: ప్రజాపాలన కార్యక్రమం గోకులపాడులో వైద్యసిబ్బంది శారద, చిట్టెమ్మల ఆధ్వర్యంలో అధికారులకు, ప్రజాప్రతినిధులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ డెస్కుల వితరణ



రాజోళి: మండల కేంద్రం రాజోళిలోని కోట వీధిలో ప్రభుత్వ పాఠశాలకు సాఫ్ట్‌వేర్లు డెస్క్ బెంచీలను అందించారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 61 వేల రూపాయలు విలువ చేసే పాఠశాలకు 4 కంప్యూటర్లు, 15 బెంచీలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సొంత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు సౌకర్యాలు కల్పించి, విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడటంలో ఎంతో సంతోషం ఉందన్నారు. కార్యక్రమంలో దాతలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో ఇద్దరు జంటలు కులాంతర వివాహాలు చేసుకోవడంతో వారికి కులాంతర వివాహ ప్రోత్సాహకం ఒక్కొక్కరికి రూ.2.50లక్షల చెక్కును ఎమ్మెల్యే విజేయుడు అందజేశారు. మొత్తం రూ.5 లక్షలను స్వాతి, మల్లకల్ దంపతులు, పావని, చరణ్ దంపతులకు డీఎస్‌సీడీఓ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు.

ఆర్థిక ప్రణాళికలు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల క్రైం: పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు తాము పొందుతున్న జీతాలతో కుటుంబ ఆర్థిక ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఏఎస్పీ రవి అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఆధ్వర్యంలో సిబ్బందికి ఆర్థిక ప్రణాళికలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి సిబ్బంది తీసుకుంటున్న నెలవారి జీతాలు, బ్యాంకు అందించే రుణాల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది అనిల్‌రాజు, తదితరులు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం

రాజోళి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. మండలంలోని ముండ్లదిన్నెకు చెందిన రైతులు మాన్‌దొడ్డి నుంచి ట్రాక్టర్‌లో వరిగడ్డిని తీసుకుని వస్తుండగా, మార్గమధ్యలో కిందికు వేలాడుతున్న తీగలు తగలడంతో గడ్డికి నిప్పులు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి మొత్తం కాలి బూడిదైంది. అప్పటికే డ్రైవర్ అప్రమత్తమై ట్రాలీని పక్కకు ఆపడంతో ప్రమాదం తప్పింది.

ప్రజా సేవలో పోలీసులు

- ఎన్నికల కోడ్‌లో 300 లీటర్ల మద్యం పట్టివేత
- లోక్ అదాలత్‌లో 58 కేసులు పరిష్కారం
- పెండింగ్ చాలన్లపై 80% రాయితీ
- అలంపూర్ ఎస్‌ఐ మడుగు రమేష్



మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్

అలంపూర్ రూరల్: పోలీస్‌లు ప్రజల సేవలో విధులు నిర్వహిస్తారని అలంపూర్ ఎస్‌ఐ మడుగు రమేష్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరులతో ఎస్‌ఐ మాట్లాడారు. ఎన్నికల సమయంలో కోడ్‌ను ఉల్లఘించి మద్యం తరలించడంతో 300 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. 26మందిపై 25 కేసులు నమోదు అయినట్లు 10 టూ వీలర్లను, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. లింగనవాయిలో 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ సమయంలో ఒక పార్టీకి మద్దతు తెలుపుతూ వాట్సప్‌లలో ప్రభుత్వ ఉద్యోగి మెసేజ్ పెట్టడం వల్ల ఎలక్షన్ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారమవుతాయని, ప్రస్తుతం 58 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. భూతగాదాలు, కొట్లాటలు, ఇసుక కేసులు, మద్యం కేసులు, చిన్నచిన్న తగాదాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 30న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇందులో 25 కేసులు ఉన్నట్లు తెలిపారు. 38 ఇసుక కేసులు ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై వేసిన పెనాల్టీకి 2, 3 వీలర్లకు 80% రాయితీ ఉందని, కార్లకు 60%, ఆర్టీసీ బస్సులకు 90% రాయితీ ఉందని, పెండింగ్‌లో ఉన్నవారు తక్షణమే చెల్లించాలని ఆయన కోరారు. ఈ వెసులుబాటు ఈ నెల 26 నుంచి జనవరి10 వరకు మాత్రమే కలదని ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ కోరారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు.

ప్రజల కోసమే ప్రజాపాలన

- అలంపూర్ మున్సిపాలిటీలో రెండు కేంద్రాలు
- సందర్శించిన అదనపు కలెక్టర్లు చీర్ల శ్రీనివాసులు, అపూర్వ చౌహాన్,



బైరాపురం గ్రామంలో దరఖాస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు



ధరూరు మండలం జాంపల్లిలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



జక్కిరెడ్డిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ఆరంభమైంది. అలంపూర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్యలు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. 9వ వార్డులో ఇమాంపురంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్, వార్డు అధికారి రామక్రిష్ణల ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. అలంపూర్ మున్సిపాలిటీలోని న్యూప్లాట్స్ కాలనీలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు సందర్శించారు. దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చిన వారితో అదనపు కలెక్టర్ మాట్లాడారు. రెండు కేంద్రాల్లో మొత్తం 272 దరఖాస్తులు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మేఘనాథ్ గౌడ్, కౌన్సిలర్లు జయలక్ష్మి, ఇంతియాజ్ అలీ, కో-ఆప్షన్ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ ఉన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలోని కాశీపూర్, జిల్లెలపాడ్ గ్రామాలో 475 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మంజుల, ఎంపీఓ చంద్రకళ తెలిపారు. జిల్లెలపాడ్ గ్రామంలో 94, కాశీపూర్‌లో 381 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

మానవపాడు: దరఖాస్తుల స్వీకరణ వివరాలు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తులు గ్రామసభ రోజే స్వీకరిస్తారని ఎవరైనా ఇవ్వని వారు ఉంటే పంచాయతీ కార్యదర్శికు జనవరి 6వ తేదీ వరకు అందజేయాలని సూచించారు. రేషన్‌కార్డులు లేనివారు దరఖాస్తులలో సూచించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణారావు, మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, ప్రత్యేక అధికారి సిద్దయ్య, సర్పంచ్‌లు ఉషారాణి, సుజాత, ఆర్‌ఐ రజినీకాంత్ రెడ్డి, సర్దార్‌మియ్య పాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని పడమటి గార్లపాడులో అదనపు కలెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. దరఖాస్తులు తీసుకుంటున్న తీరును, ప్రజల నుంచి అధికారులకు వస్తున్న వినతులను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధరూరు: ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. మండలంలోని జాంపల్లి, ఓబులోనిపల్లి, పెద్దపాడు, యములోనిపల్లి గ్రామాల్లో ప్రజా పాలన సభలను నిర్వహించారు. జాంపల్లిలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ జాంపల్లి సెంటర్‌ను ఆకస్మికంగా తనఖీ చేశారు. మండలంలోని పెద్దపాడు, ఎములోనిపల్లి, జాంపల్లి, ఓబులోనిపల్లి గ్రామాల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. జాంపల్లిలో 175, ఓబులోనిపల్లిలో 157, పెద్దపాడులో 272, ఎములోనిపల్లిలో 122 దరఖాస్తులు రాగా, మొత్తం 726 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ తెలిపారు.

మల్దకల్: మండలంలోని పెద్దపల్లి, పావనంపల్లి, మంగంపేట, సద్దలోనిపల్లి గ్రామాల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. పెద్దపల్లి, పావనంపల్లిలో తహసీల్దార్ హరికృష్ణ, మంగంపేట, సద్దలోనిపల్లిలో ఎంపీడీఓ కృష్ణయ్య దరఖాస్తులను స్వీకరించారు. గ్రామాలలో 601దరఖాస్తులు స్వీకరించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు, జక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. బుడమొర్సులో తహసీల్దార్ జ్యోతి, జక్కిరెడ్డిపల్లిలో ఎంపీడీఓ రవీంద్ర ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా బుడమర్సులో 306, జక్కిరెడ్డిపల్లిలో 135 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వడ్డేపల్లి మున్సిపాలిటీలో..

వడ్డేపల్లి మున్సిపాలిటీలోని పైపాడు 1,2 వార్డుల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కమిషనర్ లక్ష్మారెడ్డి, మేనేజర్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో నిర్వహించారు. 451 దరఖాస్తులు, ఇతర సమస్యల గురించి మరో 52 దరఖాస్తులు స్వీకరించినట్లు కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు.



అలంపూర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె, మైలగడ్డ, రంగాపురం, మైలగడ్డ, గువ్వలదిన్నె, రంగాపురం, పూజారితండాలో మొత్తం 987 దరఖాస్తులకు 703 వచ్చినట్లు తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ మహమ్మద్ అజార్ మోహిద్దీన్ తెలిపారు. ముంబై, బెంగుళూరు వలస వెళ్లిన ప్రజలు సైతం తరలివచ్చి దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 29న ఇర్కిచేడు, గంగన్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గురువారం మండలంలోని నందిన్నె పంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు.

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ రమణారావు, మండల ప్రత్యేక అధికారి సిద్దయ్య తెలిపారు. మండలంలోని గోకులపాడులో కార్యక్రమం నిర్వహించారు. గోకులపాడు, చంద్రశేఖర్‌నగర్‌లో నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం పెద్దఆముదాలపాడు, నారాయణపురం గ్రామాల్లో ప్రజాపాలన ఉంటుందని తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాము పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సర్ధార్‌మియ్య, సర్పంచ్ సుజాత పాల్గొన్నారు.

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం 5 గ్యారంటీల కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. మున్సిపాలిటీలోని 1, 6, 11, 16, 19 వార్డుల్లో 1500 దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని కిష్టాపురం, వెకంటాపురం, గుడుదొడ్డి, జడిదొడ్డి గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ నిర్వహించారు. మొత్తం 14,66 దరఖాస్తులొచ్చాయి. తహసీల్దార్ షహిదాబేగం, ఎంపీడీఓ సాయి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ మాట్లాడారు. శుక్రవారం మండలంలోని యాపదిన్నె, కుర్వపల్లి, నౌరోజ్ క్యాంప్, ఉప్పల క్యాంప్ గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీలోని వార్డు నం.3, 7, 12,17 వార్డుల్లో సంబంధిత అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు.

రాజోళి: ప్రజాపాలన కార్యక్రమం మండలంలో ప్రారంభమైంది. మొదటి రోజున మండలంలోని తూర్పు గార్లపాడు, పడమటి గార్లపాడులో నిర్వహించారు. పడమటి గార్లపాడు నుంచి 47 దరఖాస్తులు, తూర్పు గార్లపాడు నుంచి 118 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ గోవింద రావ్ తెలిపారు.

గట్టు: తుమ్మలచెరువు, బస్వాపురం గ్రామాల్లో ఎంపీపీ విజయ్‌కుమార్, ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, సర్పంచు అనితలు ప్రజాపాలన ప్రారంభించారు. ఎంపీఓ మహేష్ చమన్‌ఖాన్‌దొడ్డి, మల్లంపల్లి గ్రామాల్లో, మరో బృందం సభ్యులు గ్రామ సభలను నిర్వహించారు. దరఖాస్తులు సమర్పించేందుకు లబ్దిదారులు పెద్ద ఎత్తున బారులు తీరారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లో ప్రజా పాలన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.ఎర్రవల్లిలో 210, బట్లదిన్నెలో 120, గోపల్‌దిన్నెలో 172, మొగిలిరావులచెర్వులో 142 దరఖాస్తులు వచ్చాయి. గోపల్‌దిన్నెలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, ఎర్రవల్లి, బట్లదిన్నె గ్రామాల్లో ప్రత్యేక అధికారి ఈఈ వెంకటేశ్వర్లు దరఖాస్తులను క్షణంగా పరిశీలించి తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, నందిని, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ భాస్కర్ ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం, బస్వాపురంలో దరఖాస్తులు నమోదు చేసుకోవడానికి ప్రజలు బారులు తీరారు. ఎమ్మెల్యే విజయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి బీమేశ్వర్ రావ్, ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, తహసీల్దార్ వెంకట్రావ్ బైరాపురం, బస్వాపురం గ్రామాల ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు అధికారుల వద్దకు వెళ్లి దరఖాస్తులు నమోదు చేయించుకోవాలని సూచించారు. బైరాపురంలో 355, బస్వాపురంలో 167 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.



కేటీదొడ్డిలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ సరితారాణి



గోకులపాడులో అభయహస్తం దరఖాస్తు రశీదును చూపుతున్న అధికారులు



తూర్పుగార్లపాడులో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు



తుమ్మలచెరువులో...



చంద్రశేఖర్‌నగర్‌లో దరఖాస్తుల స్వీకరణ



సద్దలోనిపల్లిలో..



గువ్వలదిన్నెలో..



కేటీదొడ్డిలో ..

అలంపూర్ చౌరస్తాకు అయోధ్య అక్షతలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాకు అయోధ్య రామయ్య అక్షతలు చేరాయి. ఉండవెల్లి మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి అయోధ్య రామయ్య అక్షతలు వచ్చాయి. అభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఉండవెల్లికి చేరుకోని అక్కడి నుంచి అయోధ్య రామయ్య అక్షితలు అలంపూర్ చౌరస్తాకు తీసుకొచ్చారు. అక్షితలను ఆలయ పూజారి బోనాచారి కమిటీ సభ్యులు తిరుపతి నాయుడు, ఆర్మీ వెంకటేశ్వర్లు, చాకలి మద్దిలేటి, పుల్లూరు జగదీష్‌లు ప్రత్యేక పూజలు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, కంచుపాడు, అలంపూర్ చౌరస్తాలోని గ్రామాలకు అయోధ్య అక్షతలు తీసుకెళ్లారు. గురువారం పుల్లూరు, కంచుపాడు గ్రామాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



అలంపూర్ చౌరస్తా ఆలయానికి అక్షతలతో వస్తున్న ఆలయ కమిటీసభ్యులు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: దేశానికి స్వాతంత్ర్యం సాధించిన కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలందరికి సంక్షేమం సాధ్యమని జెడ్పీచైర్‌పర్సన్ సరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో బడుగు, బలహీన వర్గాల పేదలందరికి న్యాయం జరుగుతుందని, ప్రతి కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్, నల్లారెడ్డి, ఇసాక్, మధుసూదన్‌బాబు, వాకిటి సంజీవులు, శ్రీనివాస్‌గౌడ్, జమ్మిచేడు ఆనంద్, రాము యాదవ్, షేక్ జమాల్ ఉన్నారు.

శాంతినగర్: కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు శాంతినగర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవేంద్ర పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి, కిసాన్‌సెల్ కొంకల నాగరాజు, రామకృష్ణారెడ్డి, వెంకటేష్, చిన్ని రామన్, కరుణాకర్‌రెడ్డి, మొయినుద్దీన్, హనుమంతు పాల్గొన్నారు.

మన ఊరు-మనబడిలో కాశీపూర్ పాఠశాల

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.23.28 లక్షల నిధులు మంజూరైనట్లు హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల హెచ్ఎం రాజశేఖర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో 102 మంది విద్యార్థులు ఉన్నట్లు అందులో ప్రతిరోజు 90% విద్యార్థులు హాజర వుతున్నట్లు తెలిపారు. 5 మంది ఉపాధ్యాయులకు ముగ్గురే ఉన్నట్లు తెలిపారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పాఠశాలకు 212 టెబుళ్లు, ఒక ఆఫీస్ గది, కిచెన్ షెడ్, అన్ని గదులకు ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్, ప్రతి గదికి 4 ఫ్యాన్లు, 4 ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీటి సంపు, ట్యాంక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



కాశీపూర్‌లోని యూపీఎస్ పాఠశాల

ధరూరులో ముగిసిన క్రికెట్ టోర్నీ

ధరూరు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని 12 రోజులుగా నిర్వహించిన ధరూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ గురువారం సాయంత్రం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో ధరూరు జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టుకు బండ్ల వెంకటేశ్వరరెడ్డి రూ.40వేల నగదు, షీల్డును అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన ఆర్‌జీటీఎస్ జట్టుకు రూ.20 వేలు నగదు, షీల్డును రైతు ఆగ్రోస్ నిర్వాహకులు ధరూరు శ్యాం అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన ఈగల్స్ టీంకు రూ.10వేల నగదు, షీల్డును నిర్వాహకులు అందజేశారు.



విజేత జట్టుకు నగదు, షీల్డు అందిస్తున్న దృశ్యం

గుండెపోటుతో అంబులెన్స్ డ్రైవర్ మృతి

ఎర్రవల్లిచౌరస్తా: 44వ జాతీయ రహదారిపై అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన గొల్ల శ్రీనివాసులు (42) కొంత కాలంగా 44వ జాతీయ రహదారిపై అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. తెల్లవారుజామున ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అతని భార్య మహేశ్వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి ఆత్మహత్య- యువకుడిపై కేసు నమోదు

గద్వాల క్రైం: యువతిని ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వెంకటారమణ కాలనీకి చెందిన రేణుక (20)తో గంటవీధికి చెందిన ప్రవీణ్ స్నేహంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని బలవన్మరణం చేసుకుంది. తమ కుమార్తె మరణానికి ప్రవీణ్ కారణమని యువతి తల్లి లక్ష్మి ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరుకు చెందిన తోక హనుమంతు, పుటాన్‌దొడ్డికి చెందిన గొల్ల శ్రీనివాసులు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతురాజు సోమనాద్రి, నీలి శ్రీనివాసులు గురువారం ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5,000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

వికషిత్ సంకల్ప్ యాత్రపై అవగాహన

ఉండవెల్లి: మండల కేంద్రం, చిన్న ఆముదాలపాడులో వికషిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ, పోస్టల్ శాఖ, ఎస్‌బీఐ బ్యాంక్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ, వ్యవసాయ శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గద్వాల రూరల్: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను గురువారం రాత్రి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సోమసుం దర్‌రెడ్డి, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వాన్ తాన్వీర్

మానవపాడు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టేబిడ్డ ఆరోగ్యంగా, ఎలువంటి సమస్యలు లేకుండా పుడతారని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. రక్తహీనతకు గురైన వారికి ఐరన్ అందించాలని తెలిపారు. నార్మల్ డెలివరీకి ఆరోగ్యకేంద్రంలో కాన్పులు జరిపించాలని ఆదేశించారు. సీజేరియాన్ వల్ల వచ్చే సమస్యలను గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో చంద్రన్న, పరిమళ, ప్రసన్న, పుష్ప, తిరుమాల్‌రావు, సోని పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



డీఈఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలకు చెల్లించాల్సిన బకాలను వెంటనే చెల్లించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి మహ్మద్ సిరాజుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. వంట ఏజెన్సీ నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషన్న, ఉపాధ్యక్షురాలు సోమేశ్వరమ్మ, వర్కింగ్ ప్రసిడెంట్ సరోజమ్మలతో పాటుగా వంట ఏజెన్సీ నిర్వాహకులు డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. 5 నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గడ్డు ధరను పెంచాలని, మార్కెట్‌లో నిత్యవసర సరుకుల ధర లు పెరిగిపోయాయని, వాటికి అనుగుణంగా ధరలను పెంచి, బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓకు వినతి పత్రం అందజేశారు.

జిరాక్స్ షాపులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజోళి: ప్రజా పాలనలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న క్రమంలో జిరాక్స్ షాపుల వారు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ విషయమై గురువారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు వినతి పత్రం అందచేశారు. ప్రజా పాలన దరఖాస్తు పేరుతో పలు షాపుల యజమానులు ఆదాయ, కుల ధ్రువీకరణ, ఇతర అవసరం లేని పత్రాలను కూడా ప్రజలకు ఇచ్చి వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. పలు చోట్ల ప్రభుత్వం నుంచి దరఖాస్తులు తక్కువగా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, వాటిని జిరాక్స్ తెస్తే అధికారులు తీసుకోవట్లేదని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ సమస్యలపై ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని తెలిపారు. దస్తగిరి, నా గేష్, శంకర్ నాయుడు, సుదర్శనం పాల్గొన్నారు.